

# మా అన్నేగానీ చదివుంటే...

నల్లగా మబ్బులు కమ్మిన ఒక సందేళ మా అన్నని పొర్లించి పొర్లించి తన్నుకుంటా యింటికి తీసకొచ్చిపడేసినాడు మా నాయిన.

వాణ్ణి చూసి మా అమ్మ బిత్తరపోయింది. మా నాయినమ్మ లబలబమని నోరు కొట్టుకుంటా 'పసిబిడ్డని కొట్టి చంపేస్తావేమిరా మాదర్చోదా. వొదులట్టా' అని, మా అన్నని గబాల్న జవురుకొనింది.

అప్పటికే మా అన్న ఒళ్ళంతా బురదతో నిండిపోయి వుంది. ఆడాడ చర్మం లేచిపోయి మా నాయిన కొట్టిన దెబ్బలకి వాంపూసలాగా నలిగి పోయున్నాడు.

వాడి హాలతు చూసి మా అమ్మ కళ్లనిండుగా నీళ్లు బెట్టుకుంటే మా నాయినమ్మ శాపనార్థాలకు తగులుకునింది.

'నీ చేతులిరగ. నీ అరిచేతుల్లో పుండుబడ. కోపమొచ్చిందంటే మనిషి జన్మ ఎత్తిన

సంగతి కూడా మర్చిపోతావేమిరా ముండబాడుకోవా' అని మా అమ్మతో పాటు వలవలమని ఏడ్చింది.

వాళ్లిద్దరి ఏడుపు చూసి మా నాయిన చల్లగా చల్లారిపోయినాడు. సిగరెట్టు వెలిగించుకొని గమ్మున మంచం మీద కూచున్నాడు.

కాసేపు తాలినాక 'వాడికి ఏణ్ణీళ్లు బోసి గుడ్డలు మార్చండి' అన్నాడు.

మా నాయనమ్మ గబగబాలేచి, చెర్వలోని వేణ్ణీళ్లతో మా అన్నకు స్నానం చేయించి నడుముకు తువాలు కడతా వుంటే ఆయింట్‌మెంటు తీసుకొని మా అన్న కాడికొచ్చినాడు మా నాయిన.

మా నాయినమ్మ మా అన్నని ఒదిలేసింది.

మా నాయిన మళ్లా కోపగించుకోకుండా, వాడికి దెబ్బలు తగిలినకాడ ఆయింటు మెంటు రాస్తా మెత్తగా మాట్లాడినాడు.

'ఇస్కూలొదిలినాక గమ్మున ఇంటికొచ్చెయ్యాలి గానీ నీకా తంబలగుంట (మా ఊరి శివాలయం పక్కనే వుండే నీటి గుంటది. దీని ఎదురుగ్గానే మా అన్న చదివే జెడ్పీ స్కూలు) కాడ ఏం పని? వాన నీళ్లు ఆ వాటాన తూముల్లోంచి దూకతా వుంటే చేపలు పట్టేదానికి మోకాలు లోతుకి దిగినావే... కాలుగానీ జారితే? చదువుకోరా నాయినా అంటే నీకియ్యేం పనులురా? నాలుగక్షరాలు రాకపోతే రేపు నాలా బొక్కలుకొట్టేదానికి కూడా పనికి రావురా' అన్నాడు.

మా అన్న నోరెత్తలా.

అప్పుణ్ణే గాదు ఆ తర్వాత చాలామార్లు కూడా నోరెత్తేవాడు కాదు మా అన్న. స్కూలెగనూకడం, సినిమాలకెళ్లడం, బలాదూరు తిరగడం, మా నాయిన కంటబడడం, కుంగా తన్నులు తినడం... యిదీ వాడి డ్యూటీ!

తొలి కొడుకు గాబట్టి వాణ్ణి చదివించడానికి ఏందేందో చేసినాడు మా నాయిన. కొట్టినాడు, తిట్టినాడు, పర్‌వేట్‌లో పెట్టించినాడు...

మా అన్న వింటేగా!

ఎనిమిదో కిలాసు వచ్చేతలికి ఎదురు తిరిగేసినాడు.

'నేను ఇస్కూలుకు పోనుపో. పని నేర్చుకుంటా' అని మా నాయినకే జవాబు చెప్పేటంతటోడయినాడు. వాడి ఎదురు జవాబులు చూసి ఈసారి మా అమ్మ

సావగొట్టేసింది వాణ్ణి, ఇస్కూలుకు పోతావా? పోవా? అని.

మా నాయినమ్మయితే 'ఆ మంజాను, మస్తాను, ఖలందరు పురుగులు పడిపోను. వాళ్లని మట్టిలో పెట్టి కొప్పెట్టా. బంగారం లాంటి పిల్లోణ్ణి ఏమి చేసి పెట్నారమ్మా' అంటా మా అన్న స్నేయితుల మీద తిట్లకు దిగింది. మా అన్నకు చదువు రాకపోవడానికి ఆ ముగ్గురే కారణమని మా నాయినమ్మ నమ్మకం.

మా అన్న వాటం చూసీ చూసీ యింకిట్టగాదని ఒకరోజు సుత్తీ శానం చేతికిచ్చి వాణ్ణి కరెంటు పనిలో దించేసినాడు మా నాయిన. రోజూ వాణ్ణి తోడు తీసకెళ్లడం, జంపరుతో గోడలకు బొక్కలు కొట్టించడం, వైరింగు పని చేయించడం మొదలుబెట్టినాడు- అట్టయినా వాడు దారికొస్తాడేమోనని...

కానీ వాడెట్టాంటోడా?

నాలుగేళ్లకే పనిలో పండి పగిల్పోడిలాగా వైరింగు మొదలుబెట్టినాడు. దాంతో ఏ పనైతే వాడికి కూడా వద్దనుకున్నాడో ఆ పనే మా అన్నకు నేర్పించి ఆఖరకు వాడి మీదే ఆదారపడి పోయినాడు మా నాయిన.

మా అన్నకు పద్దెనిమిదేళ్లు వచ్చినప్పట్నుంచి మా నాయిన పని చేసిందేమీలా. మా అన్నకు మందల (పని వివరం) చెప్పేసి రావడం, మా అన్న ఆ ప్రకారం పని చేసి సాయింత్రానికి డబ్బులు తేవడం... వాటితో ఇల్లు నడిపించడం... ఇదీ మా నాయిన చేసిన గనకార్యం...!

మా అన్న పనితనాన్ని ఎవురయినా పొగడ్తా మాట్లాడితే మొకంలో సంతోషం కంటే బాదనే చూపిస్తా 'మా వాళ్ల పిలకాయలకు చదువొచ్చేదుందా? వచ్చినా సర్కారు ఉప్పు తినేదుందా? ఏదో యిట్టాంటి పని నేర్పిస్తే బతికేయబోతాడు గదా అని చేతి కిందకి తీసుకున్నాను భాయ్' అనేవాడు మా నాయిన.

చిన్నప్పట్నించి మా అన్న పనిచేసి, రెక్కలు ముక్కలు కొట్టినాడు గాబట్టి సరిపోయిందిగానీ లాకపోతేనా... కంప్యూటర్ బియస్సీ అని నేనూ, ప్రాదమికా యిశారదా అని మా చెల్లెలూ, రెసిడెన్షియల్ ఇస్కూల్ అని మా తమ్ముడు వేలకు వేలు గుంజతా ఉంటే చెల్లించడం మా నాయిన వల్ల అయ్యే పనేనా? మేము చదివేది నిజమేనా?

ఒకతడవ యిప్పటికిప్పుడు వెయ్యి రూపాయలు టరమ్ ఫీజుకు కావాలనీ, లాస్టు డేటనీ, కట్టకుంటే పరీక్షలు రాయనీయరనీ నేను ప్రాణాల మీద కూచుంటే ఏం చేయాలో పాలుబోక మా నాయిన కిందా మీదా అయిపోయినాడు.

అప్పుడు మా అన్నే యాడికోపోయి, ఏవో మోటార్లు అర్జెంటుగా బిగించి, సాయింత్రానికి ఒళ్లంతా ఆయిల్ మరకలు చేసుకుని, జేబు నిండుగా డబ్బులు పెట్టుకొని ఇంటికొచ్చినాడు.

ఆ డబ్బులు నా చేతిలో పెడతా 'మన్సూరు కూడా నీలాగే యిట్టాంటి పనికి మాలిన చదువులు చదివుంటే మనం ఏనాడో బొచ్చెత్తుకొని పోయుండే వాళ్లం. దాన్ని మనసులో బెట్టుకుని చదవుకో' అన్నాడు మా నాయిన.

ఈ కత మా అక్బరుకు చెప్పి 'పనికిమాలిన చదువు చదువుకున్నానన్న మాటేగానీ యీనాటికీ మా యింట్లో జరుగుబాటు మా అన్నదే గదా. వాడు పని నేర్చుకోకుండా వుంటే మేమంతా ఏమైపోయ్యుండే వాళ్లమో ఏమో. నిజ్జంగా మా అన్న మాకు దేముడు' అనంటే- 'మీ ఇంట్లోనేనా దేముడు నాయినా? మా ఇంట్లో లేడా? మనలాంటోళ్ల ఇళ్లల్లో ఇంటికొకడు లేడా?' అన్నాడు అక్బరు, నాకు తోడుబోతా.

